రీతిక శీర్షిక యువతకై ప్రత్యేకించిన శీర్షిక. యువకవులు, కథకులు అనేకమంది తమ కథలను, కవితలను 'ఆహ్వానం' పత్రికకు పంపుతున్నారు. వీరిని ప్రోత్సాహించేందుకై రీతిక శీర్షికలో క్రొత్త కవులకు, కథకులకు కొన్ని పేజీలు కేటాయిస్తున్నాం. ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన యువతరం తమ కథలను, కవితలను సామాజిక అవగాహన కొరవడకుండా సంక్షిప్తంగా రాసి పంపితే ప్రచురిస్తాం. --ఎడిటర్

# పోటీ

అంగర వెంకటేశ్వరరావు

"ఎం.కాం. ఫస్ట్‌క్లాస్, స్పోర్ట్స్ కల్చరల్ యాక్టివిటీస్, సోషల్ సర్వీస్ ..... అన్నింటి-లోనూ నువ్వే ఫస్టన్నమాట!"

"యస్సార్!" వినయంగా అన్నాను

"వెరీ గుడ్, నీలాంటి వాళ్ళే మాక్కావాలి ......."

"ఐతే ఈ ఉద్యోగం నాకిచ్చేస్తారా సార్?" ఆతృతగా అడిగాను.

"సారీ నీకివ్వం" చెప్పాడు ఆఫీసర్ ఫైల్ మూసేసి నాకిచ్చేస్తూ.

"ఎందుకని సార్?"

"నీ కంటే ఫస్టొచ్చిన బెస్ట్ కాండిడేట్‌ని ఆల్రెడీ సెలెక్ట్ చేశాం కనుక!

నువ్వు మరింకెక్కడైనా ప్రయత్నించు"

నిరాశగా వెనక్కి తిరిగాను.

స్కూలు చదువునుంచి యూనివర్సిటీ చదువు వరకూ అన్నింటిలోనూ ఫస్టు వచ్చిన నేను జీవితంలోనే ఫస్టు రాలేక పోతున్నాను. ఇది నలభై ఆరో ఇంటర్వ్యూ. ఎక్కడికి వెళ్ళినా నిరాశే 'హలో' అంటోంది.

ఉద్యోగంలోనే కాదు, ప్రేమించిన సుజాత విషయంలో కూడా ఇదే జరిగింది. కాలేజీలో చేరిన దగ్గర్నుంచీ సుజాతా నేను ప్రేమించుకున్నాం. ఐతే బలరామ్ నాకంటే ఫస్ట్ వెళ్ళి సుజాత నాన్నతో మాట్లాడాడు. తన డబ్బుతో ఆయన్ను ఆకట్టుకున్నాడు. సుజాత కూడా అతనివైపు మొగ్గింది. తర్వాత కొద్ది రోజులకే వాళ్ళ వివాహం జరిగిపోయింది.

సుజాతపై కక్షతో కమలను పెళ్ళి చేసుకున్నాను. ఆవేశంలో పెళ్ళయితే చేసుకున్నాను గాని, జీవితం గురించి ఆలోచించలేదు. ఇప్పుడు కమలే ఓ కాన్వెంట్లో ఉద్యోగం చేస్తూ, నన్ను బాబును పోషిస్తోంది. భార్య జీతంతో జీవించవలసి రావడం దుర్భరమే అయినా తప్పలేదు. నా అప్లికేషన్లకి, ఇంటర్వ్యూలకి వెళ్ళడానికి డబ్బుకావాలి కదా!

ఎలాగైనా ఉద్యోగం సంపాదించి తీరాలనే పట్టుదలతో మూడు రోజులుగా ఇంటికి రాకుండా తిరుగుతున్నాను. ఎక్కే గుమ్మం - దిగే గుమ్మం. రెండ్రోజులుగా చాయ్ నీళ్ళతోనే బతుకుతున్నాను. నీరసంగా వున్నా ఆకలి వేయడం లేదు. చదువులో ఫస్ట్ వచ్చిన నేను జీవితంలో లాస్టు అయిపోయాను. ఫస్ట్ రాజారావుగాడు ఇప్పుడు లాస్టు రాజారావు.

ఛ్ఛ! లాభంలేదు. ఏదో చేయాలి! ఆఁ! అదే...... అలాగే చేస్తాను!! నాకిప్పుడెంతో ఆనందంగా వుంది. ఉద్యోగం లేక భార్యాపిల్లల్ని పోషించలేని లాస్టు రాజారావు ఫస్టుగా చచ్చిపోతాడు.

దారిన పోతున్న ఓ స్టూడెంటును టైం అడిగాను.

"పదకొండున్నర"

మరో పదిహేను నిమిషాల్లో బ్రిడ్జిమీదకు గౌతమి ఎక్స్‌ప్రెస్ వస్తుంది. నేను చాలాసార్లు ఆ రైల్లోనే ఇంటర్వ్యూలకు వెళ్ళాను. అదెప్పుడూ రైట్ టైంకే వస్తుంది. బ్రిడ్జిమీదకు సరిగ్గా పదకొండూ నలభైఐదు నిమిషాలకు వస్తుంది. బ్రిడ్జివైపు నడిచాను.

రైలు వచ్చే పట్టాలమీద పడుకున్నాను. మరో ఐదు నిమిషాల్లో ........ ఊహూ.... ఆలోచించకూడదు. చావు గురించి ఆలోచిస్తే భయం వేస్తుంది. బతకాలనిపిస్తుంది. ఆలోచనలు కట్టిపెట్టి కళ్ళు మూసుకున్నాను.

రైలింకా రాలేదేమిటి? అతను టైం తప్పు చెప్పాడా? వచ్చి ఇరవై నిమిషాలు కావొస్తున్నా రైలు రాదేం? రైలు లేటా? లేదే! ఆ రైలు ఎప్పుడూ కరెక్ట్ టైం కే వస్తుంది మరికొంత సేపు చూశాను. రైలు రాలేదు. ఏమిటో తెలుసుకుందామని రైల్వేస్టేషన్ వైపు నడిచాను. దూరంగా కనబడిన దృశ్యం నన్ను దిగ్భ్రాంతుడిని చేసింది.

నన్ను చంపకుండా ఆగిన రైలది! చుట్టూ జనం వున్నారు. గబగబా అక్కడికి వెళ్ళాను. "ఏమైంది" గుంపులో ఒకతన్ని అడిగాను.

"ఎవరో యువకుడు రైలు కింద పడ్డాడు"

"నిరుద్యోగేమో! చేతిలో సర్టిఫికెట్లు కూడా వున్నాయి" మరెవరో అన్నారు.

"హూ! ఇక్కడ కూడా పోటీయే. నాకంటే ఫస్ట్ వచ్చి నాకు చావులో కూడా పోటీ అయ్యావా మిత్రమా! అనుకున్నాను నిరాశగా.

